హామీలకే పరిమితమా..!?

- డ్రెయినేజీలు లేక ఇబ్బంది
- ఐదేళ్ల కింది మంత్రి హామీ అటకెక్కింది
- పట్టించుకోని అధికారులు
- రోగాలబారిన గ్రామస్తులు
- ప్రత్యేక నిధులు బుట్టదాఖలు




ఇళ్ల మధ్య నుంచే పారుతున్న మురుగు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని వెంకటాపూర్‌లో డ్రెయినేజీల నిర్మాణం హామీలకే పరిమితమైంది. ఐదేళ్ల క్రితం మంత్రి కేటీఆర్ మురుగు నీటి కాలువల పరిష్కారానికి ప్రత్యేక నిధులు కేటాయిస్తామని ఇచ్చిన హామీ నేరవేరలేదు. ఫలితంగా గ్రామస్తులు మురుగు కంపు భరించలేకపోతున్నారు. నివాస ప్రాంతాల నుంచే మురుగు నీరు పారుతుండడంతో డెంగీ, మలేరియా లాంటి వ్యాధులు ప్రబలి కాలనీవాసులు రోగాల బారిన పడుతున్నారు. అయినప్పటికీ అధికారుల్లో చలనం లేదు. సమస్య తీవ్రంగా ఉండడంతో గ్రామస్తులు మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీ నేరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఫ్లెక్సీలతో గ్రామంలో నిరసన వ్యక్తం చేశారు. మూడు రోజుల పాటు రిలే నిరాహార దీక్ష చేపట్టగా, అధికారులు ఆగమేఘాల మీద వచ్చి సమస్యను పరిష్కరిస్తామని చెప్పి, చేతులు దులుపుకున్నారు.

ఐదేళ్ల కింది హామీ నెరవేరదేమీ?

గ్రామంలో ఐదేళ్ల క్రితం పర్యటించిన మంత్రి కేటీఆర్ క్షేత్రస్థాయిలో డ్రెయినేజీ సమస్యను గుర్తించారు. వీటికి పరిష్కారం చూపుతామని ఆ సందర్భంగా హామీ ఇచ్చారు. మంత్రి హామీ ఇవ్వడంతో సమస్య పరిష్కారం అవుతుందని భావించిన వారికి నిరాశే మిగిలింది. మురుగు నీరు ఏరులై పారడమే కాకుండా చెత్త రోడ్ల వెంట ఎక్కడ పడితే అక్కడ పేరుకుపోవడంతో ప్రజలు అనారోగ్యంతో బాధపడుతున్నారు. స్వచ్ఛతలో జిల్లా దేశంలోనే అగ్రగామిగా నిలుస్తుండగా స్థానికంగా మాత్రం డ్రెయినేజీలు నిర్మించకపోవడం విచారకరం.

దీక్షలతో దిగివచ్చిన అధికారులు

2017లో గ్రామంలో డ్రెయినేజీలు నిర్మిస్తామని ఇచ్చిన హామీ నేరవేరకపోవడంతో గ్రామస్తులు దీక్షలు చేపట్టారు. దీక్షలు చేపట్టిన రోజు హుటాహుటిన డీపీవో రవీందర్, ఎంపీడీవో చిరంజీవి, ఎమ్మార్వో జయంత్‌కుమార్ గ్రామానికి వెళ్లి సమస్య తీవ్రతను పరిశీలించారు. మురుగు నీటితో ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించి త్వరలో పరిష్కారం చూపుతామని నచ్చచెప్పారు. రెండు రోజుల్లో డ్రెయినేజీలను నిర్మించడమే కాకుండా చెత్తను తొలగిస్తామని హామీ ఇవ్వడంతో దీక్ష విరమించారు. కాని ఐదు రోజులు గడుస్తున్నా ఆ గ్రామం వైపు అధికారులు కన్నెత్తి చూడడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని లేకుంటే కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.

ఇబ్బంది పడుతున్నం



ఇంటి ముందు నుంచే మురుగు కాలువ వెళ్లడంతో ఇబ్బంది పడుతున్నాం. చిన్నపిల్లలు అందులో జారి పడుతున్నారు. వాసన భరించలేకపోతున్నాం. స్థానికంగా ఈ సమస్యను పంచాయతీ పాలకవర్గం దృష్టికి తీసుకుపోయిన పట్టించుకోవడం లేదు. వెంటనే సమస్యను పరిష్కరించి రోగాల బారి నుంచి కాపాడాలి.

– శివరాత్రి లక్ష్మి, గ్రామస్తురాలు

నిధులు కోసం ప్రతిపాదనలు



మురుగు నీటి కాలువల సమస్య తీవ్రంగా ఉన్నట్లు గుర్తించాం. నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే డ్రెయినేజీలు నిర్మించి శాశ్వత పరిష్కారం చూపుతాం. రోడ్ల వెంట ఉన్న చెత్తను తొలగించాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించాం. డీపీవో, కలెక్టర్‌కు నివేదిక అందించాం.

– చిరంజీవి, ఎంపీడీవో, ఎల్లారెడ్డిపేట

క్లుప్తంగా

డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు, నాయకులు

ముస్తాబాద్: మంత్రి కేటీఆర్ హామీ మేరకు కళాశాలను ముస్తాబాద్‌లో తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థులు, నాయకులు సోమవారం రాస్తారోకో చేపట్టారు. స్థానిక రాజీవ్ చౌక్‌లోని సిద్దిపేట–ముస్తాబాద్ రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చి నాలుగేళ్లు అమలుకు నోచుకోలేదన్నారు. ఇప్పటికైనా ప్రారంభించకుంటే, దశల వారీగా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు, ఇంటర్ విద్యార్థులను పోలీసులు శాంతింపచేసి ఆందోళన విరమింపచేశారు. ఎంపీటీసీ చెర్లపల్లి శ్రీనివాస్, పట్టణశాఖ అధ్యక్షుడు గజ్జెల రాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రాండ్ చాంపియన్‌షిప్ సాధించిన విద్యార్థులు



గ్రాండ్ చాంపియన్‌షిప్ సాధించిన కరాటే విద్యార్థులతో మాస్టర్ దివ్య

వేములవాడ: వేములవాడలోని స్పార్క్ కుంగ్‌ఫూ కరాటే విద్యార్థులు ఈనెల 8న కాల్వశ్రీరాంపూర్‌లో జరిగిన నేషనల్ టోర్నమెంట్‌లో గ్రాండ్ చాంపియన్‌షిప్ సాధించినట్లు కరాటే మాస్టర్ గగ్గూరి దివ్య సోమవారం తెలిపారు. సీనియర్ విభాగంలో లాస్య, ఆర్నవఠాకూర్, జూనియర్ విభాగంలో విఘ్నేష్ గ్రాండ్ ఛాంపియన్ సాధించారు. అలాగే లత, హంసిని, ఆద్రిత, అలీనా, రేష్మిత, ఆగస్త్య, మహీదర్, అశ్విత గోల్డ్ మెడల్స్ సాధించారు. రోష్ని, నక్షత్ర, ప్రసన్య, సంజన, మన్విత, షాహెద్, రుత్విక్ సిల్వర్ మెడల్స్ సాధించారు. మాస్టర్ ఎండీ అమిత్, శ్రీనివాస్ అభినందించారు.

ఏఐటీయూసీలో చేరిక



కండువా కప్పుతున్న కదారి రాములు

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని తెలంగాణ చౌక్ వద్ద పది మంది మున్సిపల్ కార్మికులు ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి కదారి రాములు ఆధ్వర్యంలో సోమవారం చేరారు. వారికి కండువ కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై పోరాడుతామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామల మల్లేశం, నాయకులు పోచెట్టి, శ్రీనివాస్, లింగన్న, నర్సయ్య, రాజయ్య, నరేశ్ పాల్గొన్నారు.

వంద కోట్ల కుంభకోణం బయటపెట్టాలి

- వేములవాడ ఎమ్మెల్యేకు సవాల్
- మున్సిపల్ ఎదుట కాంగ్రెస్ నాయకుల నిరసన



గాంధీ విగ్రహం వద్ద పత్రాలు చూపిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేములవాడ: వేములవాడలో వంద కోట్ల కుంభకోణం జరిగిందని ప్రకటించి జర్మనీకి వెళ్లిన ఎమ్మెల్యే రమేశ్‌బాబు వందకోట్ల కుంభకోణాన్ని బయటపెట్టాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం మున్సిపల్ కార్యాలయం ముందున్న గాంధీ విగ్రహం వద్ద రిజిస్ట్రేషన్ పత్రాలను ప్రదర్శించారు. సేవ్స్‌కు సంబంధించిన వంద పడకల ఆసుపత్రికి సంబంధించిన భూమి ఏమైందని, మూలవాగు ఒడ్డున 120 గుంటల స్థలానికి అనుమతులు ఉన్నాయా అంటూ వారు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాగారం వెంకటస్వామి, చంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, చిలుక రమేశ్, కూరగాయల కొమురయ్య, తూం మధు, కనికరపు రాకేశ్, ఎర్రం ఆగయ్య, ప్రభాకర్‌రెడ్డి, వస్తాద్ కృష్ణ, ఖమ్మం గణేశ్, కూరగాయల ఆగయ్య, చిలివేరి శ్రీనివాస్, నాగుల విష్ణు, అక్కనపల్లి నరేశ్, వనపర్తి శంకర్, కొలకాని రాజు, నాగుల మహేశ్, సాబీర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులను ఎత్తివేయాలి

- కోర్టు విధులను బహిష్కరించి నిరసన తెలిపిన న్యాయవాదులు



సిరిసిల్లలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

సిరిసిల్లటౌన్/వేములవాడ: నిజామాబాద్‌లో న్యాయవాదులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వసంతం డిమాండ్ చేశారు. సిరిసిల్ల, వేములవాడలో కోర్టు ఎదుట సోమవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. తమ విధులు నిర్వహించేందుకు నిజామాబాద్ కలెక్టరేట్‌కు వెళ్లిన న్యాయవాది, కోర్టు సిబ్బందిపై కేసు పెట్టడం, వరంగల్‌లో సీఐ, మరో కానిస్టేబుల్ న్యాయవాదిపై దాడి చేయడం కేసు పెట్టడాన్ని బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గడ్డం సత్యనారాయణరెడ్డి, సీనియర్ న్యాయవాదులు నేరెళ్ల తిరుమల్‌గౌడ్, నాగుల సత్యనారాయణ, చెర్ల ఆనంద్, పిట్టల మనోహర్, కొడిమ్యాల పురుషోత్తం తప్పుపట్టారు. కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి అనీల్‌కుమార్, ఉమాశంకర్, లక్ష్మారెడ్డి, సత్యనారాయణ, ధర్మేందర్, భాస్కర్, సంజీవరెడ్డి, లక్ష్మన్, అంజయ్య, నాగరాజు, గోవర్ధన్, విష్ణు, జ్యోతి, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

ధనుర్మాస ఉత్సవాలు



చందుర్తి: మండలంలోని బందపల్లి, మల్యాల గ్రామాల్లోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. సోమవారం తెల్లవారుజామునే భక్తులు ఆలయంలో శ్రీమన్నారాయణున్ని స్మరిస్తూ ప్రత్యేక పూజల్లో పాల్గొంటున్నారు. ఆలయ అర్చకులు శ్రీకొదంగుల్లా శ్రీకాంతాచార్యులు, కందాలై వెంకటనర్సింహచార్యులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు బడ్జెట్ కేటాయించండి



ఎంపీడీవోకు వినతిపత్రమిస్తున్న ఉపాధ్యాయులు

వేములవాడరూరల్: గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని ఉపాధ్యాయులు అర్బన్, రూరల్ ఎంపీడీవోలకు, మున్సిపల్ కమిషనర్‌కు వేర్వేరుగా వినతిపత్రాలు సమర్పించారు. చాలా గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు లేక ఉపాధ్యాయులే పనులు చేసుకుంటున్నారని, ప్రభుత్వం వెంటనే వారికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించి కొత్త నియామకాలు చేపట్టాలని వారు కోరారు. ఈ విషయంపై పలుసార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదని, ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘాల ప్రతినిధులు బూర సదానందం, సకినాల రామచంద్రం, గంగవరం శ్రీధర్, పులి రాంగోపాల్, ఊరడి రవి, పొన్నం శ్రీనివాస్, ఎర్రం ప్రసాద్, శ్రీనివాస్, శంకర్, మల్లేశం పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను విజయవంతం చేయాలి

- ఎంపీపీ వెంకటరమణారెడ్డి



మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరమణారెడ్డి

ఇల్లంతకుంట: మండలంలో ఈనెల 18 నుంచి ప్రారంభం కాబోతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ వెంకటరమణారెడ్డి అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. గ్రామాల్లో ఏళ్ల వయస్సు ఉన్న వారి నుంచి కంటి పరీక్షలు నిర్వహిస్తారని, వంద రోజుల పాటు కంటి పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ మీర్జా, వైద్యాధికారిణి శరణ్య, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చల్ల నారాయణ పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో శిక్షణ

పీహెచ్‌సీలో సోమవారం కంటి వెలుగు కార్యక్రమంపై ఏఎన్‌ంలు, ఆశ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయగా జిల్లా ఉపవైద్యాధికారి శ్రీరాములు హాజరయ్యారు. మండల వైద్యాధికారి శరణ్య, హెచ్‌ఈవో ఖుద్దూస్ పాల్గొన్నారు.

జంబోరిలో..



ముస్తాబాద్: రాజస్థాన్‌లోని రోహత్‌లో జరుగుతున్న 18వ జంబోరిలో ముస్తాబాద్ మండలం ఆవునూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల స్కౌట్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈనెల 10వ తేదీ వరకు జరిగే జంబోరి మేళాలో ఆవునూర్ విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయని పీఈటీ సురేశ్ తెలిపారు. సాహసకృత్యాలు, యుద్ధతంత్రం, గన్‌ఫైరింగ్ వంటి అంశాలను తెలుసుకున్నట్లు వివరించారు.

పోలీసు ఉద్యోగ ఎంపికలో నిబంధనలు సడలించాలి

వీర్నపల్లి/గంభీరావుపేట: రాష్ట్రంలో జరుగుతున్న పోలీసు ఉద్యోగాల ఎంపికకు పాటిస్తున్న నింబంధనలను సడలించాలని, డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మనోజ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఛలో ప్రగతిభవన్‌కు వెళ్తున్న విద్యార్థి సంఘ నేతలను పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. అభ్యర్థులకు ఆగం చేయడానికి ఎక్కడ లేని విధంగా ఫిజికల్ ఈవెంట్స్ పెట్టడం సరికాదన్నారు.

నిర్వాసితుల హామీలు నెరవేర్చాలి

బోయినపల్లి/వేములవాడఅర్బన్: బోయినపల్లి మండలం కొదురుపాకకు మంత్రి కేటీఆర్ వస్తున్న సందర్భంగా సీఎం కేసీఆర్ నిర్వాసితులకు ఇచ్చిన హామీపై స్పష్టమైన వైఖరి తెలుపాలని ముంపు గ్రామాల నష్టపరిహారం సాధన సమితి అధ్యక్షుడు జింక అనిల్ ఐక్య వేదిక అధ్యక్షుడు కూస రవీందర్, ఉపాధ్యక్షుడు కొండం శ్రీనివాసరెడ్డి వేర్వేరు ప్రకటనలలో డిమాండ్ చేశారు. మధ్యమానేరు ముంపు గ్రామాల నిర్వాసితుల ఇళ్ల నిర్మాణాలకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం రూ.5.04 లక్షలు, యువతకు ఉపాధి కల్పించాలన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఇళ్లు, భూముల నష్టపరిహారం వెంటనే అందించాలని డిమాండ్ చేశారు.

కల నిజమవుతున్న వేళ..

- చురుగ్గా గంభీరావుపేట–మల్లారెడ్డిపేట మధ్య వంతెన పనులు
- తీరనున్న వాహనదారుల కష్టాలు



మానేరువాగుపై వంతెన నిర్మాణ పనులు

గంభీరావుపేట: మండల కేంద్రమైన గంభీరావుపేట–మల్లారెడ్డిపేట గ్రామాల మధ్య మానేరు వాగుపై చేపట్టిన హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రధాన మంత్రి సడక్ యోజనలో భాగంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రూ.7.68 కోట్లతో హైలెవల్ వంతెన నిర్మాణం చేపట్టారు. దీని వల్ల ఇరు గ్రామాలతో పాటు చుట్టు పక్కగ్రామాల ప్రజలకు, రైతులకు ఎంతో ప్రయోజనకరంగా మారనుంది. ఇన్నాళ్లు ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడేవారు. ప్రస్తుతం పనులు ముమ్మరంగా కొనసాగుతుండడంతో వాహనదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. వాహనదారుల కష్టాలు ఇక తీరనున్నాయి. వాగుపై బ్రిడ్జి లేకపోవడంతో ప్రయాణికులు చుట్టూ తిరిగి ప్రయాణం సాగించేవారు. మల్లారెడ్డిపేటలో సుప్రసిద్ధ శ్రీవీరాంజనేయస్వామి క్షేత్రం ఉంది. మండల పరిధిలోని గ్రామాల నుంచే గాకుండా చుట్టు పక్క మండలాల నుంచి మల్లారెడ్డిపేటకు వస్తుంటారు. మానేరు వాగు అడ్డుగా ఉండడంతో చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. వాగుపై వంతెన పూర్తయితే దాదాపు పది కిలోమీటర్ల దూరం భారం తగ్గనుంది. వచ్చే వేసవి వరకు పనులు పూర్తి చేసి వంతెనను ప్రయాణికులకు అందుబాటులోకి తేవడానికి చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీ రాజ్ ఏఈ సాయి తెలిపారు.

ఎంపీ ప్రత్యేక చొరవతో



ఎంపీ బండి సంజయ్ ప్రత్యేక చొరవతో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా రూ. 7.68 కోట్లు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఆయనకు మండల ప్రజల, రైతుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. అధికారులు పనులు త్వరగా పూర్తి చేసేలా చూడాలని కోరుతున్నాం.

– గంట అశోక్, గంభీరావుపేట

దూర భారం తగ్గుతుంది



మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం వెళ్లాలంటే మల్లారెడ్డిపేట నుంచి లింగన్నపేట మీదుగా తిరిగి వెళ్లాల్సి వచ్చేది. బ్రిడ్జి పూర్తయితే దీని ద్వారా కేవలం నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న గంభీరావుపేటకు వెళ్లవచ్చు. ఇది మల్లారెడ్డిపేట ప్రజలచిరకాల కోరిక.

– గాండ్ల రాజం, మల్లారెడ్డిపేట

సమాచారం

డిగ్రీ కళాశాలలో బ్యుటీషియన్ కోర్సు

గంభీరావుపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 19 నుంచి బ్యుటీషియన్ కోర్సును ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పిట్ల దాసు, కోర్సు కోఆర్డినేటర్ శ్రీవల్లి తెలిపారు. వుమన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు కొనసాగుతాయని తెలిపారు. కళాశాల విద్యార్థులతో పాటు ఆసక్తిగల మహిళలు ఎవరైనా బ్యూటీషియన్ కోర్సుకు దరఖాస్తులు చేసుకోవచ్చునని తెలిపారు. వివరాలకు 93460 28824కు ఫోన్ చేసి చేయవచ్చని తెలిపారు.

చేతనకు చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

వేములవాడరూరల్: క్రీడల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైన వేములవాడ మండలంలోని హన్మాజిపేట గ్రామానికి చెందిన చేతనకు మై వేములవాడ ట్రస్టు సభ్యులు సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. మహాత్మాగాంధీ జ్యోతిరావుపూలే హాస్టల్‌లో చదువుతున్న చేతన షాట్‌పుట్ ఈవెంట్‌లో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో గెలిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యింది. పాట్నాలో జరిగే ఈ పోటీల్లో పాల్గొనేందుకు కుటుంబసభ్యుల వద్ద ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఆమె తండ్రి స్వామి ట్రస్టు సభ్యులను సంప్రదించగా సాయం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మధు మహేశ్, తోట రాజు, జూపెల్లి రాజు, తాళ్లపల్లి ప్రశాంత్, మహ్మద్ అబ్దుల్ రఫీక్, సత్తయ్య, రాజేందర్, నటరాజ్‌ను అభినందించారు.

శుభ్రమైన నీరు అందించాలి



వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

వీర్నపల్లి: విద్యాలయాల్లో విద్యార్థులను పరిశుభ్రమైన తాగునీరు అందించాలని తహసీల్దార్ తాఫజుల్ హుస్సేన్ అన్నారు. మండల కేంద్రంలోని సోమవారం కస్తూర్బా పాఠశాల, మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే ఆహారం, నీరు శుభ్రతగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌వో నీలిమ, ప్రధానోపాధ్యాయులు రవి, సీఆర్పీ మహేందర్ పాల్గొన్నారు.

ఎంఈవో తనిఖీ

బోయినపల్లి: మండల కేంద్రంలోని కేజీబీవీ బాలికల పాఠశాలలో మధ్యాహ్న భోజనం తీరును సోమవారం ఎంఈవో శ్రీనివాసదీక్షిత్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో మధ్యాహ్న భోజనం నాణ్యతతో పరిశుభ్రంగా చేయాలని ఆదేశించారు.

జనహితకు విన్నపాలు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని శివారులోని కేసీఆర్ నగర్‌లో, కిష్టంపల్లిలో నివాసముంటున్న వారికి అందుబాటులో రేషన్ దుకాణాన్ని ఏర్పాటు చేయాలని సోమవారం జనహితలో తహసీల్దార్ జయంత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాల్‌రాజ్ పాల్గొన్నారు.

జనహితను సద్వినియోగం చేసుకోవాలి

వీర్నపల్లి: ప్రజా సమస్యల పరిష్కారానికి జనహితను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ తాఫజుల్ హుస్సేన్ అన్నారు. సోమవారం జనహితకు మూడు ఫిర్యాదులు అందినట్లు తెలిపారు.

అవగాహన సదస్సు

బోయినపల్లి: స్థానిక మోడల్ స్కూల్, హైస్కూల్ విద్యార్థులకు సోమవారం స్కిల్ డెవలప్‌మెంట్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమ్యూనికేషన్ స్కిల్స్, మెమోరీ టెక్నిక్, కెరీర్ గైడెన్స్, గోల్ సెట్టింగ్స్, బాడీ లాంగ్వేజ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నిమ్మల సుధాకర్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, నాయకులు సంబ లక్ష్మీరాజం, శంకర్, బొజ్జ నరేశ్, నల్లగొండ అనీల్, ఎంఎల్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కత్తెరపాక సుధాకర్, ఉత్తమ సామాజిక సేవ అవార్డు గ్రహీత గజ్జెల అశోక్ పాల్గొన్నారు.